★ మమత

– శ్రీ –

బొందలపాటి శివరామకృష్ణ

> మాతృహృదయ మనుటతోడనే ప్రేమ సుధారస భాండమని స్ఫురించక మానదు. తన సంతానమునకై నిస్స్వార్థముగా సాహసించి ఆత్మబలికైనను వెనుదీయని వ్యక్తి తల్లిగాక మఱొండేదీ?

భర్త చనిపోయి ఎంతోకాలం కాలేదు. పాపడు ఇంకా రెణ్ణెల్లకి పుడతాడనగా పోయాడు. వాడికిప్పుడు అయిదోమాసం. తొలిచూలిబిడ్డ సూరికూడా బాబుమీద బెంగతో తిండీ, తిప్పలూ తినక చిక్కి, క్షీణించి ఎండురోగంతో పోలేక పోయాడు. ఇక బ్రతకవలసింది తనూ తన చంటిబిడ్డా! తిండికి నూకలులేవు. ప్రసవించినప్పుడు పొరుగావిడవద్ద తీసుకొన్న బదులే ఇంకా తీరలేదు. ఇక బ్రతుకు తెరువెట్లా? తను ముష్టిఎత్తితే నీచమైన మనిషిగా చూడబడుతుంది. బదులుకోరితే ఎవ్వరూ ఇవ్వరూ. దొంగిలిస్తే నేరస్తురాలవుతుంది. వ్యభిచరిస్తే వేశ్యయని కులంలోంచి వెలివేస్తారు. వేరుగతిలేక తొలిబిడ్డ పోయిన దిగులుకూడా మనసులో పెట్టుకోకుండా, పచ్చిశరీరంతోటే కట్టెలమ్ముకుని కాలం గడుపుతూవుంది కమల.

మిల్లు పేరెత్తగానే ఆమెప్రాణాలు బిగుసుకపోతాయి. క్రిందటి సమ్మెలో ఆమెభర్త పోయిన దగ్గరనుండీ సమ్మెమాట వినగానే ఆమెగుండె దడదడలాడుతుంది. సమ్మెఅంటే తమ ప్రాణాలతో మిల్లు ముందు బలికావటమనీ, రక్తపాతమనీ, రుద్రభూమనీ ఆమె అభిప్రాయం. ఈ రెండుమూడు రోజులనుండీ జీతాల పెంపుకోసం మిల్లులో సమ్మె జరుగుతూంటే కట్టెల కెళ్ళకుండా ప్రాణాలు బిగబట్టుకొని భయంతో, పస్తులతో, తన పసిబిడ్డతో కొంపలో మ్రగ్గుతూవుంది.

జోలపాడుతూ సముదాయించి పసిపాపణ్ణి పండబెట్టింది; నిద్రబోతున్నాడు. తన చంటిబిడ్డను ఒంటిగా ఒదలి కట్టెలకెళ్ళాలి. ఎవరుతోడు? లేచిఏడిస్తే? వసారాలోని ఆవుదూడ సముదాయించదా! చూరుల్లో జొర్రాడుతున్న ఎలుకలు జోలపాడవా! అంతకుతప్ప తనబిడ్డకు ఇంకెవరుదిక్కు? నిద్రపోతున్న బిడ్డను ముద్దిడుకొంది. ఎత్తి హృదయానికి హత్తుకొంది. ఇక పుల్లలకెళ్ళాలి, వెళ్ళాలి. మూడురోజులనుండీ పస్తులతో కడుపు కాల్చుకొంటోంది. బిడ్డకు పాలు చాలటంలేదు. బిడ్డమీద మమత హృదయాన్ని చీల్చుతోంది. కడుపులోనిమంట కడుపును కాలుస్తుంది. బిడ్డను ఒంటిగా ఒదిలిపోవాలి. నేను తిరిగివచ్చేదాకా చూస్తుండమని ఎవరికి చెప్పిపోతుంది? రోజూ ఇంటిదరి ఇల్లాలుతో చెప్పిపోయేది. ఇవ్వాళ ఆమెకూడా ఇంటివద్దలేదు. రోజూ పూజిస్తున్న పోలేరమ్మ ఉందిగా! ఆమెకే మనసులో మ్రొక్కుకొంది. తన దుర్భాగ్యంమీద రెండు కన్నీటిచుక్కలు విడచింది. మళ్ళావంగి నిద్రబోతున్న బిడ్డను ముద్దిడుకొంది. బిడ్డమీద మమత పయట పట్టుకులాగుతున్నా ఆగక కడుపుమంటలకు లొంగి, కంటి నీటితో కట్టుతాడు పుచ్చుకొని, ఇంటితడిక వేసి బయలుదేరింది అడవికి.

మధ్యాహ్నపు ఎండ చిటచిటలాడుతోంది. చిల్లులతో చినిగి జీరాడే పయటచెంగు నెత్తినవేసుకొని, పాతచెప్పులజోడు తొడుక్కొని కట్టెలకెళుతోంది కమల. మొహానికి కొడుతున్న వెచ్చటిగాలికి

ఆమె లేతచెక్కిళ్లు కందిపోతున్నాయి. చెమటబిందువులు ఆ కందిన చెక్కిళ్లమీద నుండి సున్నటి నుదిటి మీదికి జారుతూ ముత్యాలసరులులాగ మెరుస్తున్నాయి. రోజూ తారకూడా తోడుగావచ్చేది. దాని బాబుచేయి మిల్లు చక్రంలో పడి నలిగిపోవటంవల్ల కట్టుకడుతూ 'వస్తాను పద'మంది. ఇంకా రావటంలేదు. 'అది ఒట్టి జగడాలమారిది. దారిలో ఎవరితో జగడం పెట్టుకుకూర్చుందో! ఒట్టి నిర్లక్ష్యం!' అని విసుగు కొంటూ పల్లెకేసి పారజూచింది. ఆమె వస్తున్నజాడేలేదు. అడవి దాపునేవుంది. ఒంటిగా వెళదామంటే భయమేసింది. ఎండలో ఎక్కువసేపు నిలబడలేకపోయింది. తొడుక్కున్న చెప్పులు చిల్లులుపడిన వవటంచేత పాదాలు కాలుతున్నాయి. ప్రక్కనున్న పాలచెట్టునీడను కూర్చొని సున్నితమైన నుదిటిమీదపోసిన చెమట బిందువులు ఆ చిరుగుల పయటతో తుడుచుకొంది. తారవస్తోందేమోనని చెయ్యి కంటికి మాటు పెట్టుకొని పల్లెకేసి పారజూచింది. ఇంకా రావటంలేదు. దానిబాబుకి ఎట్లావుందో? అతను మూలబడితే ఇక వాళ్లకి దిక్కులేదు. ఈపాడు మిల్లులు మనుష్యుల రక్తమాంసాలేగాదు మెల్ల మెల్లగా ప్రాణాలేహరిస్తాయి. కొందరిని ఎండబెట్టి కొందరిని నిండబెడతాయి. ఇదెక్కడి న్యాయము? ఎక్కడి సభ్యత? ఇదా నూతనన్యాయం? నవీనసభ్యత! ఆమెకు మిల్లు జ్ఞప్తికిరాగానే భర్త స్మృతికి వచ్చాడు. ఆ స్మృతితోపాటు కంట నీళ్లు నిండు కొచ్చాయి. కొంచెంసేపు ఆ స్మృతుల్లో మునిగిపోయింది. పల్లెకేసి పారజూసింది. తార వస్తున్న జాడేలేదు. ప్రొద్దుకూడా తిరిగిపోయింది.' అని కన్నీళ్లుతుడుచుకొని తిరిగి తిరిగి చూచుకొంటూ అడవికిపోయింది భయంతో—

రోజూ తార చేదోడుగావుంటే లోపలికెళితే మంచిపుల్లలు దొరికేవి. ఒంటిగా పోవటానికి భయ మేస్తోంది. రోజూ గొర్రెలమంద లొచ్చేవి. ఆ రోజున అవికూడా ఆ వైపు తొంగిచూడ్డలేదు. దరిమీద ఎండుపుల్లలేమీ లేవు. కత్తికూడా లాక్కున్నారు. పచ్చిపుల్లలు బలవంతాన విరగదీయటంవల్ల ముళ్లుకూడా గుచ్చుకొన్నాయి ఆ మృదుహస్తాలలో. కొంతవరకు విరగదీసింది. మోపు నిండలేదు. ఇంకా విరగదీస్తోంది. ముందు ఏదో గుసగుసలు వినిపించాయి.

'రోగం వదలిపోయింది. ఇక నిలవటానికి నీడలేదు. లేకపోతే లక్షాధికారులతో భిక్షాధికారులకు పంతమా!!'

'పోతే పోకపోతే మారాజులు కడుపునిండా పోయించారు. రోజూ ఇట్లాపోయిస్తే పల్లెలేంటి పట్టణాలకి పట్టణాలు భగ్గుమనిపించొచ్చు'

ఆమె భయంతో తారవస్తోందేమోనని పల్లెకేసి పారజూచింది.

పల్లెఅంతా పొగతో కమ్ముకుపోయింది. నిప్పుకెరటాలు కొంపలమీదనుండి లేచి రాకాసుల్లాగా గాలిలో విహరిస్తున్నాయి. కమలగుండె చెదరిపోయింది. ఇంట్లో బిడ్డ పండుకొన్నాడు. ఈరెండు మూడు రోజులనుండీ మిల్లులో సమ్మె జరుగుతోందనే భయంతో ఇంటినుండి కదలలేదు. ఆవాళే అడుగు బయట పెట్టింది. తనకొంపకూడా ముట్టుకొందేమో! రోజూ పాపణ్ణి చూస్తూండమని ఇంటిదరి ఇల్లాలుతో చెప్పి వచ్చేది. ఆ రోజున ఆమె ఇంటిదగ్గరలేదు. నా పాపడు! నా పాపడు!! అని గొంతుదాటి పైకిరాని స్వరంలో అరచింది. పల్లెకేసి పరుగుదీసింది.

రాళ్లూ, రప్పలూ, పొదలూ, పుట్టలూ ఏమీ ఆమెకు అడ్డంరాలేదు. అన్నీ నీడలే. పరుగుదీస్తోంది.

భయంచేత అవయవాలు స్తంభించిపోతున్నాయి. ముందడుగు పడటంలేదు. పల్లె ఇంకా ఎంతోదూరం లేదన్న స్పృహకూడాలేదు. వేడినిపట్టిచూస్తే తప్ప పంచభూతాలు పల్లెమీదికి దాడి వెడలినట్టుంది. అగ్ని కెరటాలువచ్చి తన కాళ్లముందు పడుతున్నాయి. తన శరీరం కాలిపోయినాసరే, ఎముకలు విరిగిపోయినా సరే, ఒక్కగంతులోపోయి తనబిడ్డను కాపాడుకోవాలనే ఆమెకోరిక.

కాళ్లు తడబడు తున్నాయి. ముందడుగు పడటంలేదు. గాలివిసురికి అగ్ని జ్వాలలు వేయి నాల్కలతో తన్నుకూడా అందుకో జూస్తున్నాయి. తనముందు కొంపలన్నీ కాలిపోతున్నాయి. కొన్ని ఇదివరకే భస్మమైపోయాయి. చెట్లాకులు కమురుకుపోతున్నాయి. హడలిపోయిన జీవరాసులు తమ ప్రాణాల్ని దక్కించుకోటానికి పరుగు లెత్తుచున్నాయి. వసారాలో కట్టేసున్న ఆవుదూడ కూడా పరుగెత్తుకొచ్చింది తనబిడ్డజాడైనా కనుక్కోకుండా. లోకం ఎంతస్వార్థపరమైంది? ఎవరుమట్టుకు వారు తమతమ ఆస్తిపాస్తులను భద్రపరుచుకొంటున్నారు. పిల్లలతల్లులు పడుతూ లేస్తూ తమతమ పిల్లల్ని ఈడ్చుకొంటూ పరుగులెత్తు తున్నారు. ఇంటిదరి ఇల్లాలు తనబిడ్డను చంకనేసుకొని పరుగెత్తుతోంది. తన పసిపాప డేమయ్యాడో!!

నిరాశతో, నిస్పృహతో గొంతుపైకి రాని కీచుగొంతుతో, 'నాపాపడు! నాపాపడు!!' అని అరుస్తూ వెర్రిదానిలా గొందినే పరుగుదీసింది.

'ఎక్కడికి కమలా! అదంతా అగ్నికుండమయితేను'అని మంటల్లోకి చొరబడుతూన్న కమల పయట లాగాడు సౌహాద్రి. ఆమెకు అసహ్యమేసింది. కట్టెలమ్మ్రకోటానికి ప్తోయినప్పుడు ఆ మేడాయన అట్టాగే లాగాడు. పెనగులాడి పయట చించుకొనిపోయింది. కాలుతున్న కొంపలమధ్యకు చేరుకొంది. సాహసించి నిప్పు ముట్టుకోకుండా బట్టలెగబట్టుకొని తన గొందికి పరుగుదీసింది.

మంటలు నలువైపులకూ వ్యాపించి మార్గాల్ని నిరోధిస్తున్నాయి. తన కొంపకు తూర్పునున్న గుడిశెకూడా తగులబడిపోయింది. తనకొంప తగులబడకుండావుంటే తన పాపడు జీవించియుంటే, అంత దుఃఖంలోనూ ఆశపడి, పోలేరమ్మకు పోతునిస్తానని మొక్కుకొంది. ఆఖరికి తనకొంపకూడా ముట్టుకోటం చూచింది. గనగన మండుతోంది. ఆమెగుండె దడదడలాడుతోంది.

కొంపలోకి జొరబడింది. పొగ వూపిరాడకుండా ఉక్కిరిబిక్కిరిచేస్తోంది. వెనుకనుండి మంటలు తరుముకొస్తున్నాయి. పిల్లవాడి మంచంకూడా అంటుకొంది. అగ్నిజ్వాలలు మృత్యుదేవత నాలుకల్లాగా అతన్ని మింగజూస్తున్నాయి. ఆ తాపానికి తాళలేక బిడ్డడు కక్కటిల్లి ఏడుస్తున్నాడు. వాడిఒళ్లంతా ఎర్రగా కందిపోయింది.

కొడుకా! కొడుకా!! అని ఎత్తి హృదయానికి హత్తుకొంది. ఆ వుత్సాహంలో పయట అంటుకొంది కూడా తెలియలా. వసారాకూలి వాకిటికడ్డంగా పడింది. ఇంటికి మరోమార్గంలేదు. మంటలు మృత్యుదేవతలాగా చేతులు జాపుకొంటూ దగ్గరకొస్తున్నాయి. వేడిమికి ఒడలు వుడుకెత్తిపోతోంది. కోటిదేవుళ్లకూ అంతులేని మ్రొక్కులు మ్రొక్కుకొంది. ఎప్పుడు చెల్లిద్దామనో! రోజూ పూజలు పొందుతున్న పోలేరమ్మకు కూడా దయరాలేదు. నన్ను 'రక్షించండి! రక్షించండి!!' కేకలేసింది. ఆ రణగొణధ్వనిలో ఆ దీనాలాపనలు ఎవరికి వినబడతాయి? కాలిపోతున్న బొంగులు టఫ్‌టఫ్‌మని సమాధానమిస్తున్నాయి. ఏడుకొండలవాణ్ణి తలచుకొంది. ఆపత్ బాంధవుడుకూడా ఆవిణ్ణి అప్పట్లో ఆదరించలేకపోయాడు!

జ్వాలలు దాపుకొస్తున్నాయి. పయట మంట పైకి చేరుకొంది. బిడ్డ నిస్పృహతో వ్రేలాడి పోయాడు. ముద్దుబిడ్డడి లేతబుగ్గలు తన చెక్కిళ్లకద్దుకొని మంటల్లో మిళితమైపోయింది!